# ఏడుస్తున్న మానవాత్మ



-పాంగ్రిడింకి సుబ్రమణి

ప్రభుత్వం జమదగ్నికి డిస్ట్రిక్ట్ మాజిస్ట్రేట్‌గా ప్రమోషన్ నిచ్చి, అతణ్ణి విజయవాడ నుండి విశాఖపట్నానికి ట్రాన్స్‌ఫర్ చేసింది. సంతోష తరంగిత హృదయంతో — ఒక వేపు అలవికాని ఆనందంతో తబ్బిబ్బు అయినా, మరొక వేపు పాత మిత్రులకు దూరమయి, కొత్త పరిసరాలను, కొత్త పరిచయాలను ప్రయత్న పూర్వకంగా కౌగిలించుకోవలసి వచ్చినందుకు అతను ఖిన్నుడు కూడా అయాడు. రోజు రోజుకీ సంవత్సరాల మిత్రుల్ని, పరిచయస్తుల్ని జీవన ప్రాంగణానికి దూరంగా జరిగిపో మరిచిపోవలసి వచ్చినందుకు ప్రమో తూన్న వయసుని తలుచుకొని, అనేక షస్ తెచ్చిన సంతోషం అతనిలో అణ్చే

బయట తుంపర సన్నగా పడుతూంది. చాలాసేపట్నుంచి పడుతున్న వానజల్లుకు, వీస్తూన్న చలిగాలికి పట్టణమంతా ముడుచుకుపోయి ఉండలా చుట్టుకుపోయినట్లు కనిపించసాగింది.

అటువంటి చలిగాలిలో ఒంటి నిండుగా దుప్పటి కప్పుకుని, కుర్చీని కిటికీకి సమీపంగా తెచ్చుకుని బయటకు తదేకంగా చూస్తూ కూర్చున్నాడు జమదగ్ని. వాతావరణం ఇలా చల్లగా ఉండి, పరిసరాలు ఇంతటి నిశ్శబ్దంగా ఉండడం అతను సర్వ సాధారణంగా ఇష్టపడతాడు. ఇటువంటి సమయాలే మనిషి భూత భవిష్యత్ వర్తమానాల గురించి ఆలోచిస్తూ, వాటిలోని తారతమ్యాలను ఆరాతీస్తూ, జీవితంలోని తీపు చేదులను వివిధ కోణాలనుంచి పరీక్షించేందుకు అనువుగా ఉంటాయని అతనిభావన. అతనలా కూర్చుని ఎన్నోసార్లు ఆలోచించాడు. తన భవితవ్యాన్ని పూలబాటగా మలిచేందుకు లెక్కలేనన్ని ప్రణాళికల్ని నిర్మించాడు. మధురమైనవి, చిరకాలం స్మృతి పథంలో చెక్కు చెదరకుండా నిలిచి పోయేవయిన బాల్యపు రోజుల్ని పదే పదే జ్ఞప్తికి తెచ్చుకుని తనను తాను మైమరిచాడు.

## బాధకులు

**తాము భగవంతుని అవతారాలమని, కారణజన్ములమని ప్రచారం చేసుకునే వేదాంతులు కనీసం పంటి నొప్పినికూడా భరించలేరు. ఇతరులను మాత్రం 'బాధ'ను ఓర్చుకోవాలని, కష్టాలను 'సుఖం'గా స్వీకరించాలని నీతి బోధ చేస్తారు.**

—షేక్స్‌పియర్

కాని, ఈరోజు అతను ఆలోచించేందుకు భయపడుతున్నాడు. గతాన్ని కళ్ళముందుకు తెచ్చుకుని, మధుర స్మృతు లనే కుంచెలతో రంగులు పూసి, తనివితీరా ఆలోచించేందుకు అతను సాహసించలేక పోతున్నాడు. అస్పష్టమైన, తనకే అగమ్యగోచరమైన తన బాల్య జీవితంలోకి కాస్త లోతుగా వెళ్ళి, అప్పటి పరిస్థితుల్ని కళ్ళకు కనిపించేలా వెలికి తీయడానికి అతను గజగజ వణికిపోతున్నాడు. ఈగల్లా మూగుతూ, ఇనుప గొలుసుల్లా అతణ్ణి బిగిస్తున్న పాత జ్ఞాపకాలనుండి పారిపోవా లనుకుంటున్నాడు. కాని, అతడు పూర్తిగా విఫలు డయాడు. తను ఆరోజు ప్రొద్దుట చూసిన ఆవిడ ముఖం — ఇంతవరకూ తాజ్‌మహల్ అంతటి అందంగా, బలంగా తయారుచేస్తూ వచ్చిన తన జీవిత నిర్మాణాన్ని, పునాదులతో సహా పెకలించేటంతటి సంచలనాన్ని, సంక్షోభాన్ని రేకెత్తించింది. అతను పైకి నిర్మలాకాశంలా, ప్రశాంత సరస్సులా ఉండేందుకు ప్రయత్నించినా, ఆకాశపు గోపురాలను చీలుస్తూ ప్రతిధ్వనించే పిడుగుల్లా, నదీ జలాలను కల్లోలితపరుస్తూ లేచే తుఫానులా ఆలోచనలు అతణ్ణి స్తిమితంగా ఉండనివ్వ లేదు.

• • •

అప్పుడు తనకు తొమ్మిదేండ్లు కూడా నిండి ఉండవు. మిలిటరీలో సుబేదారుగా పనిచేస్తున్న నాన్న గారు ట్రక్కు ఆక్సిడెంటులో చిక్కుకుని ప్రాణాలు వదిలారు. అమ్మ నాన్నగారి మనశ్శాంతి కోసం ఇంట్లో పూజలు జరిపించి, ఫోటోలో ఉన్న నాన్నగారి నుదుట తిలకం పెట్టి, ఫోటోకి నాలుగు వేపులా పసుపు రాసింది. అత్తమ్మ తనను మంగలి దగ్గరకు తీసుకెళ్ళి ముండిత శిరస్కుణ్ణి చేసింది.

నాన్నగారి మరణంతో, అమ్మకు నుదుట కుంకుమ మాత్రమేకాదు, ఆమె ముఖంలో నిత్యమూ కనిపించే చల్లని నవ్వు కూడా శాశ్వతంగా మాయమయింది. అమ్మ ముఖం అలా నీరసంగా, జీవరహితంగా తయారవడం చూసి తనకు దిగులేసేది.


"ఏం అమ్మా, ఎప్పుడూ ఇలా కూర్చుంటావు? ముందులా నాతో ఎందుకమ్మా మాట్లాడడం మానేశావు? చెల్లిని చూసి ఎందుకమ్మా నవ్వడం ఆపేశావు?" తన మాటలు విని, ఏదో స్వాప్నిక జగత్తు నుండి ఊడి పడ్డట్టు, కళ్ళు తెరిచి చూసేది అమ్మ.

"దేనిని చూసి నవ్వనురా, నాన్నా?" ఇంకా అదే దైన్యమైన ముఖం పెట్టుకొని అడిగేది అమ్మ.

"నా ముఖం చూసి నవ్వమ్మా! చెల్లెలితో ఊసులాడుతూ నవ్వమ్మా!" అని తను బతిమాలేవాడు. అమ్మ "అలాగా!" అన్నట్లు బుర్ర ఊపేది. అలా బుర్ర ఊపేటప్పుడు అమ్మ కళ్ళ నుండి కన్నీటి బొట్లు జలజలమని రాలి పడేవి. అమ్మ ఏడవడం చూసి, తనకు దుఃఖం పొంగుకొచ్చేది.

"ఏమమ్మా ఏడుస్తున్నావు?" అమ్మ జబ్బను కుదుపుతూ అడిగేవాడు తను.

"నేను మట్టుకేనా ఏడవడం! ఇంకొన్నాళ్ళకు మీ రందరూ నాతో కలిసి ఏడవాలిరా!" అని తనను గుండెల్లో దాచుకునేది.




అవును! అమ్మ అన్న మాటలకు అర్థం తనకు త్వరలోనే తెలిసి వచ్చింది. అంతవరకూ జీవితపు తుఫానులకు దూరంగా ఉండి, ఎటువంటి కదలికా లేకుండా ఉన్న నిర్మలమైన సరస్సు వంటి తన జీవితం, భూకంప మంతటి బీభత్సాన్ని ఒక్కమారుగా ఎదుర్కోవలసి వచ్చింది.

ఒక రోజు మధ్యాహ్నం స్కూలు నుండి నేరుగా వచ్చి, "అమ్మా, ఆకలేస్తూందే! బువ్వ పెట్టు" అని పుస్తకాల సంచీని మంచం మీద పడేసి, వంట గదిలోకి వెళ్ళి కూర్చున్నాడు తను.

"కొంచెంసే పుండరా, జమదగ్నీ! అక్కయ్య బియ్యం తేవడానికి వెళ్ళింది. త్వరలోనే వచ్చేస్తుంది" అని అమ్మ తనను ఊరడించసాగింది. మరికొంతసేపటికి కూడా అక్కయ్య వచ్చే జాడ కనిపించక, తను నేలమీద దొర్ల సాగాడు. తనలా ఆకలీ, ఆకలీ అని అరిచి మైకంతో నిద్రపోయిన చాలా సేపు తరవాత తనను లేపి, గంజి అన్నం తినిపించింది అమ్మ. అప్పుడా గంజి అన్నమే తనకు అమృతంలా అనిపించింది.

సరైన తిండి లేక, అమ్మకు పాలు ఊరడం ఆగిపోయింది. నెలనెలా అమ్మకు వచ్చే పెన్షన్ బొత్తిగా చాలేది కాదు. తను స్కూలుకి ఎప్పుడో ఎగనామం పెట్టేశాడు. ఒకవేపు ఇంటి కోసం బియ్యం తేలేక, మరొక వేపు చెల్లికి పాలు కొనుక్కొని రాలేక అక్కయ్య సతమత మయ్యేది. ఏది ఏమైనా, త్వరలోనే భూమాత చెల్లెల్ని తన కడుపులో పెట్టుకుంది.

ఒక రోజు ఇల్లుగలమ్మ ఇంటిని తక్షణం ఖాళీ చేసెయ్యమని పిచ్చి కుక్క అరిచినట్లు అరుస్తూంది. దారినిపోయే దానయ్య లందరూ ఇంటి చుట్టూ గుమి గూడారు. ఆవేదనతో అలమటించిపోతూ, అవమానంతో క్రుంగిపోతూ అమ్మ ఆమెను కొంచెం ఆగమని కాళ్ళూ చేతులు పట్టుకొని బతిమాలుతూంది. అయినా ఆమె ఆగలేదు. ఆమెకు డబ్బు పిచ్చి పట్టుకున్నట్లుంది. ఇంటిచుట్టూ గుమిగూడి, చోద్యం చూస్తూన్న వారి నందరినీ పిలిచి, తా మివ్వవలసిన ఇంటద్దె బకాయిల్ని లెక్కపెట్టి వారికి చెప్పుతూంది. మూడు రోజుల నుంచీ జ్వరంతో బాధపడుతున్న అత్తమ్మ ఇదంతా నిస్సహాయంగా చూస్తూ పడుకుంది. ఈ అలజడిలో, ఇటువంటి క్లిష్ట పరిస్థితిలో అమ్మకు తోడుగా ఉండి, సహాయం చేసే బదులు, అక్కయ్య పెట్టెలోనుంచి చీరె తీసి కట్టుకొని, త్వరలో వచ్చేస్తానని చెప్పి వెళ్ళిపోయింది. తను బిక్కచచ్చిపోయి నిలుచుండిపోయి, వెళ్ళిపోతూన్న అక్కయ్య వేపు చేయి చూపుతూ, కండ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు.

త్వరలో వచ్చేస్తానని వెళ్ళిపోయిన అక్కయ్య మళ్ళీ ఇంటికి రాలేదు. కాని, అక్కయ్య వెళ్ళిపోయిన మూడు రోజులకు అమ్మపేర ఒక మనిఆర్డర్ వచ్చింది. ఆ మనిఆర్డర్‌తో మృత్యుదేవత తల దాచుకుని ఇంట్లోకి ప్రవేశించింది కాబోలు! అది అందుకున్న మరొక మూడు రోజులకు, అమ్మ ఉరి పోసుకొని చచ్చిపోయింది. ఆ రోజు ఆ దృశ్యాన్ని చూసి, అత్తమ్మతో కలిసి తను భోరున ఏడ్చాడు. అమ్మ ఎందుకలా అకస్మాత్తుగా ఉరి పోసుకొని చచ్చిపోయిందో తన బుర్రకు తట్టలేదు.

అక్కయ్య వస్తుందేమోనని, అమ్మని ఆ రోజంతా ఇంట్లో ఉంచారు. ఎంతకూ అక్కయ్య రాకపోయేసరికి, అమ్మను చెల్లిని తీసుకుపోయినట్టే తీసుకుపోయారు.

ఇప్పుడు తను, అత్తమ్మ ముందులా కష్టపడటం లేదు. స్కూలుకు బకాయి పడ్డ ఫీజంతా కట్టేసి, అత్తమ్మ తనను స్కూల్లో చేర్పించింది. అమ్మ ఉన్నప్పుడు నెల కొకసారే మని ఆర్డర్ వచ్చేది. ఇప్పుడు రెండు మూడు సార్లయినా వస్తూంది. ఒక రోజు తను ఆ మని ఆర్డర్లను ఎవరు పంపిస్తున్నారని అత్తమ్మను అడిగాడు.

"దైవం పంపిస్తూంది, బాబూ!" అం దామె. అలా అన్నప్పుడు అత్తమ్మ కళ్లలో కన్నీళ్ళు సుళ్లు తిరిగాయి. తన చిట్టి బుర్రకు, ఆ జవాబు ఏమాత్రం తృప్తిని ఇవ్వలేదు. అక్కయ్య ఇంట్లో నుంచి వెళ్లిపోయిన తరవాతనే ఇంటి ఖర్చులకు సరిపోయేటంతటి డబ్బు అత్తమ్మకు అందుతూంది. అయినా, దానికోసం ఆలోచించగల జ్ఞానం, ముఖ్యంగా జిజ్ఞాస అప్పట్లో తన కంతగా లేదు. ఇంకొక రోజు తను అక్కయ్యను గురించి అత్తమ్మను అడిగాడు. ఇక రాదని కుండ బద్దలు కొట్టినట్లు జవాబిచ్చింది అత్తమ్మ. దానితో తను ఆ ఊసు మళ్లీ ఎత్తలేదు.

తను కాలేజీలో చేరేటప్పటికి అత్తమ్మ ఒక బట్టలు కుట్టే మిషను కొని, చుట్టుపక్కల వారికి బట్టలు కుట్టిస్తూంది. ఇంటికి మని ఆర్డర్లు రావడం మానేసేటప్పటికి తనకు వయసు పద్దెనిమిది సంవత్సరాలు దాటింది. అత్తమ్మ బట్టలు కుట్టివ్వడం వల్ల వచ్చే డబ్బుల వల్ల, తాము ఆర్థికంగా అంత ఇబ్బంది పడ నవసరం లేకపోయింది.

చాలా కాలంగా తన మనసులో గూడు కట్టుకొని వస్తున్న సందేహాల పుట్టను ఒక రోజు అత్తమ్మ ముందుంచి, వాటిని వివృత్తి చేయమని నిలదీసి అడిగాడు తను.

"అనవసర విషయాల గురించి ఆలోచిస్తూ బుర్ర పాడు చేసుకోకు, నాయనా! నీ మానాన నువ్వు చదువుకో!" అని సంభాషణను త్రుంచివేయాలని చూసింది అత్తమ్మ. అయినా, తను అత్తమ్మను జలగలా పట్టుకొని విడిచిపెట్టలేదు.

"బీదవాడు కష్టాలు పడేటప్పుడు దేవుడు చాలా బిజీగా ఉంటాడు, అత్తమ్మా! ఇది నాకు తెలియదని నువ్వు మాటను మారుస్తున్నావు. నువ్వుగాని నాకు సంతృప్తికరమైన జవాబియ్యవూ — ఈవేళ నేను అన్నం ముట్టేది లేదు" అని తను ఖండితంగా చెప్పేశాడు. పెండ్లయిన మూడేండ్లకే భర్తను కోల్పోయి, ఇంతవరకూ వితంతువుగానే జీవిస్తున్న నాన్నగారి చెల్లెలు ఆ మాటలు విని, ఎండుటాకులా అల్లల్లాడి పోయింది.

"నా మాట విను, జమదగ్నీ!"

"నన్నింకా చంటాడి క్రింద జమ కడుతున్నావు, అత్తమ్మా!"

"నా కళ్లకు నువ్వింకా చంటాడివేరా, జమదగ్నీ!"

"కావచ్చు. కాని, నన్ను అనుమాన మనే చీకటి కూపంలో ఉంచి, నన్ను నీకు దూరం చేస్తున్నావు, అత్తమ్మా!" ఇది విని అత్తమ్మ కళ్లనుండి కన్నీటి చుక్కలు రాలి పడ్డాయి.

"ఎంత మా టన్నావురా, జమదగ్నీ! నువ్వింతగా బాధ పడుతున్నావు కాబట్టి చెపుతున్నాను. కాని, ఒక షరతు. ఈ జవాబుతో నన్ను విడిచిపెట్టేయి. సరేనా?"

"సరే!"

"ఆ మనిఆర్డర్లను మీ అక్కయ్యే పంపేదిరా!"

"అవును. నేను ముందే అనుకున్నాను. కాని, అక్కయ్యలా ఎందుకు దొంగతనంగా పంపేది?" అని తను అత్తమ్మ వేపు తల తిప్పి అడిగాడు. కాని, అత్తమ్మ అప్పటికే అక్కణ్ణించి వెళ్లిపోయింది.

"ఏం, అక్కయ్య ఎందుకు కనిపించ కూడదు?" అని గట్టిగా అరిచి, అడగా లనిపించింది. కాని, తను అడగలేక పోయాడు. ఏదో అజ్ఞాత శక్తి తన గొంతును నొక్కి పట్టేసింది. తనకే తెలియని ఏదో భయం, విషంలా తన శరీరమంతా ప్రవహించి, తనను మూగ వాణ్ణి చేసింది. ఆ రోజు నుంచి అక్కయ్య ఊసు ఎత్తకూడదని తను ఒట్టు పెట్టు కున్నాడు. అమ్మ మరణానికి, అక్కయ్య పంపిన మొదటి మనిఆర్డర్‌కి ఏదో అవినాభావ సంబంధం ఉండకపోదని తన హృదయాంతరాళంలో నాటుకు పోయింది. సరైన కారణాన్ని తెలుసు కొనేందుకు, కనీసం ఊహించేందుకే తను భయపడ్డాడు. అసలు తనెందుకు భయపడుతున్నాడో నేటి వరకూ తనకే అర్థం కాదు.

* * *

ఆలోచనలనుండి తేరుకున్న జమదగ్నికి కళ్ల నుండి కన్నీరు ధారావాహికంగా ప్రవహించసాగింది. అతను మెల్లగా నడిచివెళ్లి, బీరువా తెరిచి, చిన్నప్పుడు తమ కుటుంబమంతా కలిసి తీయించు కున్న ఒక ఫోటోని చేతిలోకి తీసుకున్నాడు. అందులో చెల్లెమ్మ, అక్కయ్య, తను, అత్తమ్మ, అమ్మ, నాన్న ఉన్నారు. అతనికి తెలియకుండానే తన భార్యా బిడ్డల మీద ద్వేషం పుట్టుకొచ్చింది. సుందర స్వప్నం వంటి వాళ్ల జీవితాన్ని తలుచుకొని, అతనికి అసూయ కలిగింది. తన అక్కయ్య త్యాగాన్ని, సర్వస్వాన్ని వీళ్లంతా చేరి కొల్లగొడుతున్నట్లు అతనికి అనిపించ సాగింది.

ఒకసారి వెళ్లి అక్కయ్య గురించి పోలీసు స్టేషన్‌కి ఫోను చేసి చూస్తే! నో! నో! ఒక డిస్ట్రిక్ట్ మాజిస్ట్రేట్, ఆఫ్టరాల్ ... అతను బలంగా తల విదిలించుకున్నాడు. 'భగవంతుడా! నన్నెందుకు పుట్టించావు, తండ్రీ!' అని గట్టిగా దిక్కులు పిక్కటిల్లేలా అరవా లనిపించిం దతనికి. భరించలేని బాధ అతని శరీరమంతా విషంలా పాకిపోయి, అతని సర్వ ప్రాణ సారాన్ని పీల్చేసినట్లు, అతని ముఖమంతా పాలిపోయింది. వణుకుతూన్న కాళ్లతో నడిచి వెళ్లి, దేవుని పటాన్ని సమీపించి రెండు చేతుల్ని చాచా డతను. అత నేదో ప్రార్థించేందుకు నోరు తెరిచాడు. కాని, వెంటనే గొంతులో ఏదో అడ్డు పడినట్లు ఆగిపోయా డతను. గుండెల్ని చీలుస్తూ తన్నుకొస్తున్న గుండె నొప్పిని ఆపేందుకు అతను గుండెను బలంగా అదుము కున్నాడు. కాని, ఫలితం లేకపోయింది. దెబ్బ తిన్న పావురంలా అతను గిలగిల తన్నుకోసాగాడు. హేంగర్‌కి తగిలించి ఉన్న కోటు జేబులోని మాత్రల్ని అందు కొనేందుకు ప్రయత్నిస్తూ, అతను బెడ్‌మీద వాలిపోయాడు. అప్పుడే భర్త గదిలోకి పాలగ్లాసుతో ప్రవేశించిన శారదాంబ, కెవ్వున అరిచి, పాల గ్లాసుని కింద పడేసి, భర్త కోటు జేబు లోని మాత్రల్ని తీసుకురావడానికి పరుగెత్తింది. ★

# మిత్రులు

మనసులో మెదిలా రెందరో మిత్రులు
మళ్లీ కంటికి కనుపించని మిత్రులు
అంతా ఎంతో ప్రియమైన మిత్రులు
అంత దూరా నెంత దగ్గరి మిత్రులు!

చిరకాలం నే నెరిగిన మిత్రులు
కలకాలం మరపురాని మిత్రులు
దారిలోన సాయపడిన మిత్రులు
నా కెందరో సరికొత్త మిత్రులు!

ఎన్నడు నాకు మరపురాని మిత్రులు
న న్నెన్నడు మరువజాలని మిత్రులు
ఏదో కాదు మనసిచ్చిన మిత్రులు
అందరి కందరై మెలిగే మిత్రులు!

నా కెంతగానో నచ్చిన మిత్రులు
ఎల్లకాలం నా కుండే మిత్రులు
అప్పుడప్పుడు స్ఫురించే మిత్రులు
మనసులో మెదిలా రందరు మిత్రులు!

—బి. ఎస్. ఆర్. కృష్ణ

(వీరా పెట్రిషెస్ అనే 15 ఏళ్ల అమెరికన్ బాలిక ఆంగ్ల గేయానికి సరళానుకరణ)